# మనమే గెలుస్తాం

- మీ ఆశీస్సులతో తప్పకుండా విజయం సాధిస్తాం
- మీ వెంట నేను, ప్రభుత్వం ఉన్నం
- ఈనాడు మీ దగ్గర మంచి నాయకుడున్నడు
- నేతన్నల కష్టాలు తీర్చేందుకు మీ మంత్రి కష్టపడి పనిచేస్తున్నాడు
- కార్మికుల కన్నీళ్లు తుడిచేందుకే బతుకమ్మ చీరలు
- ఎన్నికల వేళ మళ్లీ మోసగాళ్లు వస్తున్నరు
- వాళ్ల మాటలు విని ఆగం కావద్దు
- సిరిసిల్ల ప్రజా ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి కేసీఆర్



సిరిసిల్ల సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్ పక్కన మంత్రి కేటీఆర్



సభకు హాజరైన ప్రజలు

కరీంనగర్, అక్టోబర్17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : సిరిసిల్ల అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. మళ్లీ మనమే గెలుస్తామని, ఇంకా అభివృద్ధి చేసుకుందామని, అందులో ఎవరికి ఎటువంటి అనుమానమూ లేదని చెప్పారు. మీ నాయకుడు రామారావుకు మంచి భవిష్యత్ ఉన్నదని, మంచి మెజార్టీ ఇచ్చి ఆశీర్వదించాలని కోరారు. మోసపూరిత పార్టీల మాటలువిని ఆగం కావద్దని విజ్ఞప్తి చేశారు. సిరిసిల్ల నాటికి నేటికి ఎలా మారిందో ఒక్కసారి పోల్చుకోవాలని ప్రజలకు సూచించారు. ఇప్పుడు మండుటెండల్లోనూ ఎగువమానేరు మత్తడి దుంకుతున్న తీరు చూసి తనకు సంతోషంగా ఉన్నదని, ఎగువమానేరు నుంచి మధ్యమానేరు వరకు మానేరు నది సజీవధారను తలపిస్తున్నదని, భూములన్నీ పచ్చదనంతో కళకళలాడుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. తొమ్మిదిన్నరేళ్లలో ఇంత సాధించామంటే.. భవిష్యత్‌లో ఇంకా ఎంత సాధిస్తామో ఒక్కసారి ఆలోచించుకోవాలని సూచించారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మొదటి బైపాస్ రోడ్డులో మంగళవారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. స్వరాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, మానేరు సజీవ జలధారగా మారిన తీరు, నేతన్న, రైతన్న సంక్షేమానికి చేసిన కృషిని వివరించారు. ఆయన మాటల్లోనే..

### మానేరును సజీవ జలధారగా మార్చుకున్నాం

''డెబ్బై ఏండ్ల నా జీవితంలో కనీసం ఒక వంద డెబ్బై సార్లు సిరిసిల్లలో తిరిగిన. ఇక్కడ బంధాలు, బంధుత్వాలు, ఆత్మీయతలు, ఎంతో మంది క్లాస్‌మేట్‌లు ఉన్నటువంటి ప్రాంతం ఈ సిరిసిల్ల. నేను హెలీకాప్టర్ నుంచి వస్తా ఉంటే అప్పర్ మానేరు నుంచి సిరిసిల్ల వరకు మానేరు జలధారగా మారడం చూసి చాలా సంతోషమనిపించింది. నేను చిన్నప్పుడు ఆ గూడెంలో మోటర్ బైక్‌పై గానీ, సైకిల్‌పై గానీ ముస్తాబాద్ నుంచి వస్తే.. 50 ఏండ్ల కింద మానేరు నదిలో బ్రహ్మాండంగా నీళ్లు కనిపించేటియి. కానీ, సమైక్య పాలనలో మొత్తం నాశనమైపోయింది. నేనే నా కండ్లార చూసిన. ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామంలో మా అక్కను ఇచ్చినం. అక్కడ అప్పర్ మానేరు కాలువలో ఈతలు కొట్టిన. నా కండ్ల ముందే పోతుగల్ గ్రామంలో పదిహేను ఇరువై రైస్‌మిల్లులు వచ్చినయ్. కానీ, సమైక్య పాలకుల దౌర్జన్యం, దోపిడీ ఎట్లెట్ల పెరిగిందో.. అట్లనే అవన్నీ మాయమైనయ్. అప్పర్ మానేరు అడుగంటి పోయింది. దుమ్ము రేగింది. ఉద్యమ కాలంలో అప్పర్ మానేరు ప్రాజెక్టులో సభ పెట్టుకున్నం. నెర్రలు పెట్టిన భూములతో అన్నదాతలు ఆందోళన చెందిన్రు. అప్పుడే అనుకున్నం. ప్రాణం పోయినా సరే తెలంగాణ రాష్ట్రం రావాలె. మళ్లీ సజీవ జలధారగా మారాలె అని ఎట్లయితే కలగన్నమో.. ఇవాళ నెరవేర్చుకున్నం. ఎండకాలంలో దుంకుతా ఉంటే చాలా ఆత్మ సంతృప్తి కలుగుతున్నది.

### నేతన్నలను కాపాడుకున్నం

ఉద్యమ సమయంలో నేను, ప్రొఫెసర్ జయశంకర్ కలిసి తిరిగిటోళ్లం. ఒక రి మధ్యరాత్రి సిరిసిల్ల నుంచి సిద్దిపేటకు కారులో వెళ్తున్నం. ఆనాడు గోడలపై ఆత్మహత్మలు వద్దంటూ రాసిన రాతలను చూసి కన్నీళ్లు పెట్టుకున్నం. ఈ బాధలు ఎందుకని ఆనాడు బాధపడ్డం. ఆ తర్వాత మీరందరూ ఆదరిస్తే నేను ఎంపీగా అయిన. ఓ రోజు ఉదయాన హైదరాబాద్‌లో పేపర్ తిరగేస్తే ఏడుగురు ఆత్మహత్యలు చేసుకున్నట్టు కనిపించింది. ఆ వార్త చదివి చలించిపోయిన. ఆరోజు ప్రభుత్వం లేదు. కానీ, పార్టీ డబ్బులు ఒక ₹50 లక్షలు తెచ్చి ఇచ్చిన. మీకు దండం పెడుత సచ్చిపోకండి, మీ అందరినీ కాపాడుకుంట.. అని చెప్పిన. ఈనాడు మీ మంత్రి కేటీఆర్ చేనేత జౌళీ శాఖ మంత్రిగా ఉన్నరు. మీ కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు మాతో కొట్లాడి అమలు చేస్తున్నరు. అందులో భాగమే బతుకమ్మ చీరలు. అయితే, వాటిని కూడా కొంతమంది దుర్మార్గులు కాలపెడుతున్రు. ఆ చీరలను కట్టుకొమ్మని బలవంతం పెట్టడం లేదు కదా..? ఎందుకు కాలపెడుతున్రు? ఎందుకు రాజకీయాలు చేస్తున్రు? ఆ చీరల ఆర్డర్ల వెనుక ఉన్న అంతర్యమేమిటన్నది అర్థం చేసుకోలేరా..? చేనేత కార్మికుల జీవనోపాధి కోసం బతుకమ్మ చీరలు నేయించి ఇస్తుంటే దానిని రాజకీయం చేస్తున్నరు. ఇటువంటి వారిని ఏమనాలో ఒక్కసారి ఆలోచించాలి.

### కేటీఆర్ మంత్రిగా మీ ఉండడం అదృష్టం

సిరిసిల్లలో ఏమేం జరిగిందో రామారావు ఇప్పుడే చెప్పిండు. రామారావు గొప్పోడు అని పొగిడితే అది నన్ను నేను పొగుడుకున్నట్లు ఉంటది. కాబట్టి రామారావు గుణమేందో.. గణమేందో నాకంటే ఎక్కువ మీకే తెలుసు. మీరు ఆయన కలిసి పనిచేస్తున్నరు కాబట్టి, నేను రామారావును పొగిడే అవసరం లేదు. ఇక్కడ కేటీఆర్ ఎమ్మెల్యే ఉండడం మీ అందరి అదృష్టం. ఆయన, చేనేత మంత్రిగా ఉండడం వల్ల ప్రతీసారి ఏ మీటింగ్ పెట్టినా ఇక్కడ చేనేత కార్మికులకు కావాల్సిన మరమగ్గాలు, సాంచాల ఆధునీకరణకు కావాల్సిన డబ్బులు తెచ్చిండు. సిరిసిల్లలో చేనేత కార్మికుల పరిస్థితి మార్చిండు. ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి నుంచి ఈరోజు చల్లగా బతికేటట్లు చేసినందుకు రామారావును హృదయపూర్వకంగా అభినందిస్తున్న.''

### పాల్గొన్నది వీరే..

ప్రజా ఆశార్వాద సభకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అధ్యక్షత వహించగా.. రాజ్యసభ సభ్యుడు దీవకొండ దామోదరరావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ స్పీకర్ ప్రస్తుత ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఎమ్మెల్సీ ఎల్ రమణ, చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ వేములవాడ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, టెక్స్‌టైల్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, సిరిసిల్ల పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు జిందం చక్రపాణి, గ్రంథాలయ చైర్మన్ అకునూరి శంకరయ్య, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మాజీ ఎమ్మెల్యే ఉచ్చిడి మోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగరావు, రాఘవరెడ్డి, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్లు జిందం కళ, రామతీర్థపు మాధవి, జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, ఆయా మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీలు, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు, తదితర నాయకులు పాల్గొన్నారు.

### ఉద్యమ నేత వెన్నంటి నిలిచిన జిల్లా ప్రజలు



రాష్ట్ర సాధన కోసం డిప్యూటీ స్పీకర్ పదవిని తృణప్రాయంగా వదిలిపెట్టిన ఉద్యమ నేత వెంట రాజన్న సిరిసిల్ల ప్రజలు నిలిచి ఉద్యమించారు. 2001లో స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు ఈ ప్రాంతంలో ప్రజలు గులాబీ జెండానే ఎగుర వేశారు. 2004లో కేసీఆర్‌ను కరీనంనగర్ పార్లమెంటు సభ్యుడిగా భారీ మెజార్టీతో గెలిపించారు. 2006లో రాజీనామా చేసిన సమయంలోనూ, 2008లోనూ ఆయన వెంటే నడిచారు. సీఎం ఆదేశాల మేరకు 2009లో కేటీఆర్‌ను ఎమ్మెల్యేగా గెలిపించారు. ఉద్యమం, రాష్ట్ర సాధన కోసం నిరాహార దీక్షకు బయలుదేరినప్పుడు కరీంనగర్ నుంచి హైదరాబాద్ వరకు కేసీఆర్ వెంట నడిచి రాష్ట్ర సాధనలో జిల్లా ప్రజలు పోరాటం చేశారు. సబ్బండ వర్ణాలు, కులాలు, మతాలకతీతంగా రోడ్డుమీదికొచ్చి ఉద్యమాలు చేశారు. సీఎం నాయకత్వంలో దేశంలోనే గొప్ప అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తెలంగాణ ఆదర్శంగా నిలిచింది. అభివృద్ధి, సంక్షేమంలో సిరిసిల్లను ఆదర్శంగా నిలిపిన మంత్రి కేటీఆర్‌ను మరోసారి భారీ మెజార్టీతో గెలిపించి అసెంబ్లీకి పంపించాలని ప్రజలను కోరుతున్నా. సిరిసిల్ల అభ్యర్థిగా రామన్నకు టిక్కెట్ ఇచ్చినందుకు నియోజకవర్గ ప్రజల పక్షాన అధినేతకు కృతజ్ఞతలు.

**- తోట ఆగయ్య, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు**

---

## రవీందర్‌సింగ్‌తో బీఆర్ఎస్ నేతల భేటీ



పెద్దపల్లి: పెద్దపల్లి నియోజక వర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి రవీందర్‌సింగ్‌తో పార్టీ నాయకులు

పెద్దపల్లి, అక్టోబర్17: రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్, పెద్దపల్లి నియోజక వర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి రవీందర్‌సింగ్‌ను మంగళవారం పెద్దపల్లి బీఆర్ఎస్ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయనతో భేటీ అయ్యారు. ఇక్కడి రాజకీయ పరిస్థితులపై చర్చించారు. అనంతరం రవీందర్‌సింగ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు అహ్మద్ బేగ్, ఖదీర్‌ఖాన్, తబ్రేజ్, సతీశ్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో బానిసలకే గౌరవం

- బీసీ నాయకులకు అవమానం
- ఆత్మగౌరవంలేని ఆ పార్టీలో ఉండేదిలేదు
- రెండుసార్లు ఓడిన తుమ్మల కో నీతి.. పొన్నాలకు మరో నీతా?
- ఆహకారంతోనే రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు
- కాంగ్రెస్ నేత, ఓదెల జడ్పీటీసీ గంటా రాములు ధ్వజం

పెద్దపల్లి, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ):' కాంగ్రెస్ బలహీనవర్గాల వ్యతిరేకి.. ఆ పార్టీలో బానిసలకే సముచిత స్థానం ఉంటది..' అని పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ ముఖ్యనేత ఓదెల జడ్పీటీసీ గంటరాములు మండిపడ్డారు. ఆత్మగౌరవం లేని ఆ పార్టీలో ఇక కొనసాగేదీలేదని తేల్చిచెప్పారు. రేవంత్‌రెడ్డి ఆహకారంతోనే బీసీ నాయకులను దూషిస్తున్నారని ధ్వజమెత్తారు. రెండుసార్లు ఓడిపోయిన తుమ్మల నాగేశ్వర్‌రావును ఇంటికెళ్లి ఆహ్వానించారని..టికెట్ రాలేదని అలిగిన నాగం జనార్దన్‌రెడ్డిని. జానారెడ్డిని ఆయన ఇంటికి పంపించి బుజ్జగించారని, కానీ పొన్నాలను మాత్రం సిగ్గుండాలా? అని తులనాడడం ఆయనకు బీసీలపై ఉన్న చులకనభావానికి నిదర్శనమన్నారు. మంగళవారం పెద్దపల్లిలో ముఖ్యకార్యకర్తలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ అధిష్టానం.. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాజకీయాల్లో చురుగ్గాలేని మండవవెంకటేశ్వర్‌రావు, కసిరెడ్డి నారాయణరెడ్డిని వాళ్ల ఇండ్లకు వెళ్లి ఆహ్వానించారని, కానీ బీసీ నేత. నలభైఐదేండ్లు కాంగ్రెస్‌కు సేవచేసిన విద్యావంతుడు పొన్నాలపై రేవంత్‌రెడ్డి మాత్రం సిగ్గుండాలా? అని అవమానకరరీతిలో వ్యాఖ్యలు చేయడం ఆనయ ద్వంద్వనీతికి అద్దంపడతున్నదని దుయ్యబట్టారు. ఎన్నో సంవత్సరాల నుంచి కాంగ్రెస్‌లో కొనసాగుతున్న తాను..రూ. 50 వేలు చెల్లించి టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నానని చెప్పారు. తనతో పాటు మరో 80 మంది బీసీ నాయకులు పార్టీపెద్దలను కలిసేందుకు ఐదురోజులు ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో ఎదురుచూసినా అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని ఆరోపించారు. ఆ పార్టీ బీసీల ఓట్లకు గాలం వేయడం తప్ప రాజకీయ అవకాశాలు ఇవ్వడం లేదన్నారు. హైదరాబాద్ దగ్గర నాలుగు స్థానాల్లో ముస్లింలు బలంగా ఉన్న చోట్ల ముస్లీం అభ్యర్థులకు టికెట్లు ఇవ్వాల్సి ఉండగా అక్కడ బీసీలకు ఇచ్చారని విమర్శించారు. ఆ ఇంటి మీది కాకి ఈ ఇంటి మీద వాలద్దు.. ఈ ఇంటిమీది కాకి ఆ ఇంటి మీద వాలద్దని చెప్పిన రేవంత్‌రెడ్డి కాకులు వాలుడు కాదు ఆ కాకులనే కాంగ్రెస్ పార్టీలోకి కాపురానికి తీసుకచ్చుకుంటున్నాడని ఎద్దేవాచేశారు. ఈ పార్లమెంటులో బీసీలకు మొండి చేయి చూపారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇక్కడి బీసీ సమాజానికి ఏం చెబుతున్నాదని ప్రశ్నించారు. బీసీలపై చిత్త శుద్ధి లేదన్నారు. విజయరమణారావు గురించి ఏమైనా మాట్లాడితే ఆయన దాడులు చేయిస్తడు. నియోజకవర్గంలో వైష:్యలను పెంచుతడు. అహకాంరాన్ని ప్రదర్శించేవ్యక్తి అని ఆరోపించారు. కాగాతన అభ్యర్థిత్వానికి మద్దతిచ్చిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు సీ. సత్యనారాయణరెడ్డి, వేముల రామ్మూర్తి, ఇతర నాయకులతో మాట్లాడాం రేపు వారందరితో కలిసి త్వరలోనే కార్యాచరణను ప్రకటిస్తామని గంటా రాములు స్పష్టం చేశారు. కాగా. మరో రెండు రోజుల్లో పెద్దపల్లికి ఆ పార్టీ అగ్రనేత రాహుల్ రానున్న నేపథ్యంలో గంట రాములు పార్టీని వీడనుండడం చర్చనీయాంశమైంది.



పెద్దపల్లి : విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఓదెల జడ్పీటీసీ గంటా రాములు